

హైదరాబాద్ వార్త

# మెసేజ్‌లతో..బురిడీ..!

**-రుణం,జాబ్, గిఫ్ట్ అంటూ ఎస్ఎంఎస్‌లు**
**-వివరాలు పొందుపరచాలంటూ లింక్‌లు**
**-ఓపెన్ చేస్తే ..అకౌంట్ నుంచి డబ్బులు మాయం**
**-అమాయకులను ముంచుతున్న కేటుగాళ్లు**
**-నమ్మి మోసపోవద్దంటున్న పోలీసులు**



**హైదరాబాద్,సెప్టెంబరు 13 ,ప్రభాతవార్త:** అత్యాధునిక టెక్నాలజీ అందుటులోకి వచ్చిన తర్వాత ప్రతి పని షార్ట్‌కట్‌లో చేసుకోవడం అలవాటైంది. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ చేతిలోకి వచి అపరిమిత ఇంటర్నెట్ సేవలు వినియోగంలోకి రావడంతో ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిపోయింది. కరోనా ప్రభావంతో షాపింగ్‌కు వెళ్లడం, బయట తిరగడం వంటివి ప్రజలు తగ్గించారు. ఈనేపథ్యంలో అన్నింటికీ ఆన్‌లైన్‌సైవలపైనే ఆధారపడుతున్నారు. అనేక రకాలసేవల గూర్చి ఎస్ఎంఎస్‌ల రూపంలో తెలుసుకుంటూ అందుకు అనుగుణంగా ఆన్‌లైన్ సేవలను వినియోగించుకుంటున్నారు. ఈక్రమంలో ఇంటినుంచే లావాదేవీలు,బిల్లులు చెల్లిస్తున్నారు. ఆన్‌లైన్‌షాపింగ్ చేసినా, ఏవస్తువు కొనుగోలు చేసినా అందుకు సంబంధించి మెసేజ్‌లు వస్తుంటాయి. రియల్‌ఎస్టేట్ వ్యాపారం మొదలుకొని వైద్యసేవలవరకు వరకు సెల్‌ఫోన్ రీచార్జి నుంచి డేటా యూజింగ్ వరకు ప్రతి విషయాన్ని కంపెనీలు ఎస్ఎంఎస్‌ల రూపంలోనే ప్రచారం చేస్తుంటాయి. బిల్లులు సకాలంలో ఆన్‌లైన్‌లో చెల్లించడానికి ఎస్ఎంఎస్ సేవలు వినియోగించుకుంటున్నారు. ఏసమయంలో ఏబిల్లు చెల్లించలి, ఎప్పటికలోగా చెల్లించాలి అనేది ఫోన్‌కు మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది. అదిచూసిన వెంటనే మనలో చాలా మంది బిల్లులు చెల్లిస్తుంటారు. అయితే ఇలాంటి పరిస్థితులను ఆసరా చేసుకుంటున్న సైబర్‌నేరగాళ్లు అమాయకులపై తమ పంజా విసురుతున్నారు.

ఇటీవల నగరంలోని ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన ఓవ్యాపారి ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. మీరు సకాలంలో ఇన్‌కంటాక్స్ చెల్లించలేదని,వెంటనే ఆన్‌లైన్‌లో చెల్లిస్తే పెనాల్టీ పడదని లేదంటే అందనంగా ఛార్జీల రూపంలో చెల్లించాల్సి ఉంటుందని ఎస్ఎంఎస్‌లో ఉంది. దాంతోపాటు బిల్లుచెల్లించడానికి ఉపయోగించాలంటూ ఓలింక్ వచ్చింది. సదరు వ్యాపారి దాన్ని ఓపెన్ చేశాడు. అందులో పేరుసహా ఆన్‌లైన్ బ్యాంకింగ్ వివరాలు,ఎస్‌వర్డ్ నమోదు చేయాలని ఉండటంతో ముందూ వెనక ఆలోచించకుండా నమోదు చేశాడు. అంతే..లింక్‌లో పూర్తి చేసిన వివరాలన్నీ సైబర్ నేరగాళ్లకు వెళ్లిపోయాయి. నిమిషంలో ఆవ్యాపారి ఖాతానుంచి 2లక్షల మాయమయ్యాయి. ఆతర్వాత ఫోన్‌కు వచ్చిన మెస్సేజ్ చూసుకున్న అతడు ఖాతానుంచి డబ్బు మాయం కావడంతో కంగుతిన్నాడు.దీనిపై బ్యాంక్ అధికారులను సంప్రదించగా..సైబర్ నేరగాళ్లు మీ ఆన్‌లైన్ వివరాలు తెలుసుకుని డబ్బు కాజేశారని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరోకేసులో రిటైర్డ్ ఉద్యోగి వెంకటేష్ ఫోన్‌కు ఒమెసేజ్ వచ్చింది. మీకు 25లక్షల రుణం మంజూరయ్యే అవకాశం ఉందని తక్కువ వడ్డీకే ఇస్తున్నామని, కావాలంటే సంప్రదించాలని ఉంది. స్పందించిన వెంకటేష్ అందులో నంబర్‌కు ఫోన్ చేశాడు. సైబర్ నేరగాళ్లు మాయమాటలు చెప్పి అతడిని నమ్మించారు. రూ.25లక్షల రుణం మంజూరు చేస్తున్నామని చెప్పి ప్రాసెసింగ్ ఫీజుకింద రూ.2లక్షలు జమ చేయించుకున్నారు. రుణ పరిమితి పెంచామని, రూ.30లక్షలు ఇస్తున్నామని ఇలా ఏడాదిగా కాలయాపన చేస్తూ అతడినుంచి 11.50లక్షలు కాజేశారు. ఇదంతా మోసమని తెలుసున్న వెంకటేష్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను గుర్తించి పట్టుకున్నారు.

**సర్వీస్ ప్రొవైడర్లు కమీషన్ తీసుకుని..**

అయితే వందలసంఖ్యలో బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపించడానికి సైబర్ కేటుగాళ్లు సర్వీస్ ప్రొవైడర్లను ఆశ్రయిస్తున్నారు. వివిధ రకాల టెలికాం సేవలను అందించడానికి అందుబాటులో ఉన్న సర్వీస్ ప్రొవైడర్లు కమీషన్‌తీసుకుని సైబర్ నేరగాళ్లు ఇచ్చిన వందలాది పోన్‌నంబర్‌లకు బల్క్ మెసేజ్‌లు పంపిస్తుంటారు. తక్కు వడ్డీకి రుణాలు, ఉద్యోగాలు, గిఫ్టలు, ఇన్‌కంటాక్స్ చెల్లింపు అంటూ ఎస్ఎమ్ఎస్ పంపిస్తూ అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు. వాటికిస్పందించి వారి నుంచి లక్షల రూపాయలు దండుకుంటున్నారు.

# 17వరకు కొత్త ఓటరు నమోదుకు అవకాశం

**-18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి**
**-జూబ్లీహిల్స్ ప్రజలకు ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ పిలుపు**



**హైదరాబాద్, సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** జులై 1,2025నాటికి 18 ఏండ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నిక అధికారి ఆర్ వి కర్ణన్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసారు. జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గంకు సంబంధించి ప్రస్తుతం ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం-2025 కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిందన్నారు. ఈ నెల 17వ తేదీ లోగా ఓటరు నమోదుకు అవకాశం ఉందని ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు కావచ్చునని తెలిపారు. అలాగే ఫారం-7 ద్వారా ప్రస్తుత ఓటరు జాబితాలో పేరు చేర్చడం, తొలగించడంపై అభ్యంతరాలు తెలుపవచ్చునని తెలిపారు. ఫారం-8 ద్వారా ప్రస్తుత ఓటరు జాబితాలోనీ ఎంట్రీల సవరణలు, నివాసం మార్పు, దివ్యాంగులుగాఎపిక్ రీప్లేస్మెంట్ చేసుకోవచ్చునని తెలిపారు. జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పౌరులు వోటర్ హెల్ప్ లైన్ యాప్ (విహెచ్ఏ) ద్వారా లేదా అధికారిక వెబ్సైట్లు నమోదు చేసుకోవచ్చునని సూచించారు. మరింత సమాచారం కోసం సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్‌వో), ఏఈఆర్‌వో, ఈఆర్‌వో ,డిఈవోను సంప్రదించవచ్చునని తెలిపారు. అలాగే 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు కూడా కాల్ చేయవచ్చునని చెప్పారు.ఓటరుగా నమోదు కావడం హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా అని ఆర్ వి కర్ణన్ పేర్కొన్నారు.

# రసాభాసగా కాలనీ జనరల్ బాడీ సమావేశం

**- కాలనీ వాసులపై దాడి చేసిన మాజీ కౌన్సిలర్**
**- దాడులకు మా కాలనీకి సంబంధం లేదు : అధ్యక్షులు**



కాలనీ వాసులను తోసేస్తున్న మాజీ కౌన్సిలర్ పద్మారావ్ దృశ్యం



మాజీ కౌన్సిలర్ దాడి కారణంగా వెంకటేశ్వర కాలనీ సభ్యుడి తల పగిలి తీవ్ర రక్తస్రావం అవుతున్న దృశ్యం

**నార్సింగి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో శనివారం నిర్వహించిన జెనరల్ బాడీ సమావేశం రసాభాసగా సాగింది. ఒకరిపై మరొకరు వ్యక్తిగత దూషణలు చేసుకొని, పిడిగుద్దులు గుద్దుకున్నారు. కాలనీకి చెందిన ఓ వ్యక్తి తల పగిలి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరికొంత మందికి మూగదెబ్బలు తగిలాయి. గత కొంత కాలంగా కాలనీలోని సభ్యులు రెండు గ్రూపులుగా విడిపోయారు. ఈ దాడి, ప్రతిదాడులు సైతం ఆ రెండు గ్రూపుల మద్యనే జరిగాయి. కాలనీ అధ్యక్షుడు ఉపేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన సాగుతున్న ఈ జెనరల్ బాడీ సమావేశంలో కొంత మంది సభ్యులు లేచి కాలనీలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, ఏళ్ల తరబడి కాలనీ కమిటీ సభ్యులు కాలనీని పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. దీంతో మాజీ కౌన్సిలర్ పద్మారావ్ మైక్ తీసుకొని మా హయాంలోనే కాలనీలో రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, పార్కులు, వీధి దీపాలు, మంచినీటి సౌకర్యం కల్పించామని తెలిపారు. కొంత మంది సభ్యులు అవినీతిపై పదేపదే మాట్లాడడంతో సహనం కోల్పోయిన పద్మారావ్ దుర్భాషలాడుతూ ప్రశ్నిస్తున్న సభ్యులపై దాడి చేశాడు. దీంతో సభ్యులు సైతం ప్రతిదాడి చేశారు. ఇరు గ్రూపుల సభ్యులు ఒకరినొకరు తోసుకున్నారు. ఈ దాడుల్లో కాలనీ సభ్యుడు రాజ్ కుమార్ తలకు బలమైన గాయమైంది. ఇతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మాజీ కౌన్సిలర్ తన చేతికి ఉన్న కడెంతో కొట్టడం వల్లనే తల పగిలిందని బాధితులు ఆరోపిస్తుండగా, తోపులాటలో గేటు కొనకు తగిలి తల పగిలిందని పద్మారావ్ వర్గం పేర్కొంటుంది. కాలనీ అసోసియేషన్ చేస్తున్న అక్రమాలు, అవినీతిని ప్రశ్నిస్తే భౌతిక దాడులు చేసి, భయపెడుతారా? అని బాధిత సభ్యులు వాపోతున్నారు. వాస్తవాలు బయటకు చెప్పకుండా, చేసిన తప్పులు కప్పి పుచ్చుకునేందుకే మాపై దాడులు చేశారని, మాపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ప్రశాంతంగా ఉండే కాలనీలో ఈ దాడి తరువాత ఒక్కసారిగా వాతావరణం ఉద్రిక్తంగా మారింది.

**ఈ దాడులకు మా కాలనీకి సంబంధం లేదు : ఉపేంద్రనాథ్‌రెడ్డి**

వెంకటేశ్వర నగర్ కాలనీ జెనరల్ బాడీ సమావేశంకు దాడులకు ఎలాంటి సంబంధం లేదని కాలనీ అధ్యక్షులు బొమ్మ ఉపేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్యనే తోపులాటలు, దాడులు చోటు చేసుకున్నాయని, మా కాలనీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. వాట్సాప్ గ్రూపులలో మాజీ కౌన్సిలర్ పద్మారావ్‌ను కించపరిచేలా మెసేజ్‌లు పెట్టడం వల్లనే ఈ దాడులు జరిగినట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. ఒక్క రోడ్డు, డ్రైనేజి, మంచినీరు, వీధి దీపాలు లేని కాలనీని ఆరేళ్లుగా కష్టపడి ప్రజా ప్రతినిధులు, అధికారులను పదుల మార్లు కలిసి కోట్ల రూపాయల నిధులు తీసుకు వచ్చి అన్ని రకాల మౌళిక సదుపాయాలు కల్పించామన్నారు. మేము చేసిన అభివృద్ధి కళ్లముందే కనిపిస్తుందని అధ్యక్షులు ఉపేంద్రనాథ్‌రెడ్డి వివరించారు.

# రెచ్చిపోతున్న ఓ ఇద్దరు ఘనపాటీలు

**-అవినీతికి కేరాఫ్ సర్కిల్ 24 ఏసిపి, టీపీఎస్‌ల కార్యాలయాలు**
**-కూకట్‌పల్లిలో అక్రమ నిర్మాణాల జోరు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి సర్కిల్ 24 పరిధిలోని పలు ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపులేకుండాపోతోంది. సర్కిల్ 24 ఏసీపీ, టీపీఎస్‌ల కార్యాలయాలు అవినీతి, అక్రమ వసూళ్లలో రికార్డు సృష్టిస్తున్నాయి. కూకట్‌పల్లి, హైదర్‌నగర్, వివేకానందనగర్, ఆల్విన్ కాలనీ డివిజన్‌లలో అనేక మంది తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా ఐదారు అంతస్తులు నిర్మిస్తున్నప్పటికీ ఏసీపీ, టీపీఎస్‌లు పటిన్టంచుకోవడంలేదు. బిల్డర్లు, నిర్మాణదారులు అక్రమ నిర్మాణాలు చేపడితే కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు బ్రోకర్లు మద్యవర్తులతో అక్రమ వసూళ్ళు చేస్తూ అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముడుపులు అప్పగిస్తే అక్రమ నిర్మాణాలు సక్రమంగా కొనసాగుతాయి. లేకుంటే నిర్మాణాలను నిలిపివేయడమో పాక్షి కంగా అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తున్నారు. ముడుపులు ముట్టచెప్పి ఆక్రమ నిర్మాణదారులు తిరిగి నిర్మాణాల్ని యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అనేక ప్రాంతాల్లో జీప్లస్ టూ వరకు అనుమతులు తీసుకున్నప్పటికీ ఐదారు అంతస్తుల నిర్మాణాలు కొనసాగున్నాయంటే అధికారులు ఏ మేర ఆక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారో తెలుస్తుంది. అనేకమంది బిల్డర్లు అయితే నిబంధనల్ని చాలావరకు ఉల్లంఘిస్తున్నారు. అనేక ప్రాంతాల్లో వ్యక్తిగత గృహ నిర్మాణాలతో పాటు వ్యాపార, వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు పెద్దఎత్తున కొనసాగుతున్నాయి. దీంతో అధిక శాతం నిబంధనల్ని ఉల్లంఘిస్తూ నిర్మిస్తున్నవే. అక్రమ నిర్మాణాలను నిరోధించాలని ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తుంటే మరో వైపు కొందరు అవినీతి అధికారులు నీరుగార్చుతున్నారు. మామూళ్ళను దండుకుంటూ తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అనేక ప్రాంతాల్లో లెక్కకు మించి ఆక్రమ కట్టడాలు జరుగుతున్నాయి. అనేక భవనాలు అనుమతులు లేకున్నా నిర్మాణాలు చకచక జరుగుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా అధికారులు అసలు పట్టించుకోవడంలేదు. నివాసయోగ్య భవనాలకోసం అనుమతి పొంది కమర్షియల్ భవనాల్ని నిర్మిస్తున్నా ఇలాంటి ఆక్రమ కట్టడాలపై అధికారులు దృష్టి సారించడంలేదు. ఒక్కో ఆక్రమ ఫ్లోర్‌కి కొందరు అధికారులకు భారీగానే ముడుపులు అందుతున్నాయని గుసగసలు వినిపిస్తున్నాయి. సర్కిల్ 24 టౌనింగ్ విభాగం అధికారులు ఇటీవలి కాలంలో పర్యటించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏదో మొక్కుబడిగా అప్పుడప్పుడు నామమాత్రంగా కొన్ని అక్రమ నిర్మాణాలను పాక్షి కంగా తొలగించి ఉన్నతాధికారుల దృష్టిని మరల్చుతున్నారు. ఆక్రమ అపార్ట్‌మెంట్లు పుట్టుకొచ్చి అధికారులు, బిల్డర్ల మాయాజాలం మూలంగా అమాయకులు లక్షలాది రూపాయలకు ప్లాట్లను కొని నిలువునా మోసపోతున్నారు. ఉన్నతాధికారులు కూడా సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వల్లనే అపార్ట్‌మెంట్లలో ప్లాట్లను కొని కొనుగోలు దారులు మోసపోయే పరిస్థితి ఏర్పడుతుంది. కూకట్‌పల్లి సర్కిల్ 24లోని పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఏసీపీని వివరణ కోరగా తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే కొందరు అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చామని తెలిపారు.

**ఎవరా ఇద్దరు ఘనాపాటీలు?**

కూకట్‌పల్లి సర్కిల్ 24 అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) టౌన్ ప్లానర్ సూపర్వైజర్ (టీపీఎస్)ల కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న ఓ ఇద్దరు అధికారులు అక్రమ వసూళ్లలో రికార్డు సృష్టిస్తున్నారు. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి టౌన్ ప్లానింగ్ విభాగంలో సీట్లు దక్కించుకున్న ఈ ఇద్దరు అవినీతి ఘన పాటిల అక్రమాలకు అంతే లేకుండా పోయింది. కూకట్‌పల్లి, వివేకానంద నగర్,హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ, ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు, కమర్షియల్ నిర్మాణాలు రూ. కోట్లు కురిపిస్తున్నాయి. జేబులు నింపుకోవడానికే పరిమితమైన ఈ ఇద్దరు అధికారులు గ్రేటర్ ఆదాయాన్ని కొల్లగొడుతున్నారు. ఇప్పటికైనా అవినీతి నిరోధక శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు మేల్కొని టౌన్ ప్లానింగ్ విభాగాల్లో రెచ్చిపోతున్న అధికారులపై నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

# 17నుంచి అక్టోబర్ 2 వరకు బిజెపి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

**ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య**




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య

**ముషీరాబాద్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినం, ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం నుంచి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు బీజేపీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య స్పష్టం చేశారు. శనివారం భారతీయ జనతా పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్‌కు సంబంధించిన ఎనిమిది జిల్లాల బీజేపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సేవా పక్షానికి సంబంధించిన రివ్యూ మీటింగ్ కొమురయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలపై సవివరంగా చర్చించారు. సెప్టెంబర్ 17 మోదీ జన్మదినం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేయాలని, సెప్టెంబర్ 18న అన్ని శక్తి కేంద్రాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించాలని, ఆత్మనిర్భరభారత్, వికసిత్‌భారత్ పైన స్కూల్స్, కాలేజీల్లో చిత్రలేఖన పోటీలు నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ 21న రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటుచేసే నమో మారథనలో పాల్గొనాలని, సెప్టెంబర్ 25న పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ప్రతి పోలింగ్ బూత్‌లో విధిగా మొక్కలు నాటాలని, వారిని స్మరించుకుంటూ మేధావుల సదస్సు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేయాలని, ఖాదీ వస్తువుల్ని కొనుగోలు చేసే విధంగా అందరినీ ప్రేరేపించాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 27న దివ్యాంగులకు సంబంధించినటువంటి సన్మానసభ, పరికరాల్ని పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని, సెప్టెంబర్ 28న జాతీయ అవార్డు గ్రహీతలకు సన్మాన కార్యక్రమం, అక్టోబర్ 2న గాంధీ జయంతి, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని పుష్పాంజలి ఘటించాలని కార్యక్రమాలను రూపకల్పన చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యద ర్శులు డాక్టర్ ఎన్.గౌతం రావు, తుళ్ల రవీందర్‌గౌడ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు గణేష్ గుండె, జిల్లాల అధ్యక్షులు భరత్ గౌడ్, రాంభూపాల్‌గౌడ్, నిరంజన్ యాదవ్, ఉమా మహేందర్, వి.శ్రీనివాస్‌రెడ్డి కార్పోరేటర్‌లు ఉమా రమేష్‌యాదవ్, అమృత, ఎడెల్లి అజయ్‌కుమార్, వెంకటస్వామి, శ్యాంరాజ్, మూల రవీందర్‌గౌడ్, 8 జిల్లాలలో ఉన్న సేవా పక్షం కమిటీ సభ్యులు, బీజేపీ ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాల జివోను విడుదల చేయాలి




మాట్లాడుతున్న ఎం.డి.యూసఫ్. చిత్రంలో ఎం.నర్సింహ్మా తదితరులు

**సైఫాబాద్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కనీస వేతనాల జివోను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, అవసరమైతే నిరవధిక సమ్మెకు దిగుతామని కౌన్సిల్ సమావేశం హెచ్చరించింది. శనివారం నాడిక్కడ సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్, ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా మాట్లాడుతూ తెలంగాణలో రాష్ట్రం ఏర్పడక ముందు 2010లో కార్మికులకు కనీస వేతనాలు పెంచారని, ఆ తరువాత ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందని, అయితే బిఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ళు పాటు ఎంత మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ఆనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న కనీస వేతనాల బోర్డు ఏర్పడినప్పటికి బోర్డు సలహాల ప్రకారం విడుదల చేసిన కనీస వేతనాల జివోలను యాజమాన్యాలు అంగీకరించడం లేదని, దీంతో బిఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, దీంతో 20 లక్షల మంది కార్మికులకు వేతనాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జివోలను సలహా మండలి సలహాల మేరకు జివోను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కౌన్సిల్ సమావేశంలో యూనియన్ నాయకులు హసినాబేగం, లక్ష్మీ,బాయి, సురేష్, సుధాకర్ మాట్లాడుతూ అక్టోబరు 8న వేలాది మంది కార్మికులతో కార్మిక భవన్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## బంజారాహిల్స్‌లో కారు బోల్తా

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో శుక్రవారం రాత్రి ఒక కారు బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం చోటుచేసుకోలేదు. బంజారాహిల్స్ పోలీసుల కథనం పక్రారం.. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ జుబేర్(19) బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో తన ఐ20 కారులో తన సోదరితో ప్రయాణిస్తున్నాడు. కెనడా నుంచి వచ్చే మరో సోదరిని ఎయిర్‌పోర్టుకు బయలుదేరాడు. శుక్రవారం రాత్రి దాదాపు 10.30 గంటల ప్రాంతంలో ఒక మహిళ కారుకు అకస్మాత్తుగా అడ్డు రావడంతో జుబేర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో కారు ఒక్కసారిగా అదుపుతప్పి రెండు పల్టీలు కొట్టింది. బంజారాహిల్స్ హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా కారు నడుపుతున్న జుబేర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేనట్లు పోలీసులు గుర్తించారు.

## శ్రీకాంత్ రెడ్డిని హత్య చేసింది ఇద్దరు రౌడీషీటర్లు

**కుషాయిగూడ, సెప్టెంబర్ 13,ప్రభాతవార్త** రియల్టర్ శ్రీకాంత్ రెడ్డిని హత్య చేసిన నిందితులు ఇద్దరు రౌడీషీటర్ లేదని తేలింది. ఆర్థిక లావాదేవీల కారణంగా ఈనెల 11 గురువారం జరిగిన రియల్ టర్ బి శ్రీకాంత్ రెడ్డి ని హత్య చేసిన దుండగులో ఇద్దరు రౌడీషీటర్లనే తేలింది. భూ వివాదాల సెటిల్మెంట్ విషయంలో కోటి రూపాయలు అర్చకు పాల్పడిన దుండగులు డేనియల్ ధనరాజులకు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకపోవడంతో శ్రీకాంత్ రెడ్డిని హత్య చేయడానికి దారి తీసిందని పోలీసులు అనుమానిస్తున్నారు.శ్రీకాంత్ రెడ్డి ని అతి దారుణంగా హత్య చేసిన సంఘటనలో లాలాపేట ప్రాంతానికి చెందిన ధనరాజ్ అనే వ్యక్తిని అదే రోజు అరెస్టు చేయగా , శ్రీకాంత్ రెడ్డిని ప్రత్యక్షంగా హత్య చేసిన మరో దుండగుడు డానియల్ (31)పరారీలో ఉండగా నార్త్ జోన్ పోలీసులు అరెస్టు చేసి కుషాయిగూడ పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. అర్చకు పాల్పడిన ఇద్దరూ లాలాపేటకు చెందినవారు కావడంతోపాటు ఇద్దరిపై రౌడీషీట్లు సైతం ఉన్నట్లు గుర్తించి నార్త్ జోన్ పోలీసులు దుండగుడు డేనియల్ ప్రియురాలి సహకారంతో చాకచక్యంగా డేనియల్ ను అరెస్టు చేసి పోలీసులకు అప్పగించారు. గతంలో హత్య కేసులో ఇతర గొడవల కేసులో ధనరాజ్ ధాన్యాలపై లాలాగూడ పోలీస్ స్టేషన్లో రౌడీషీట్ తెరిచి ఉండడం గమనార్హం. అర్చకు పాల్పడిన ఇద్దరి దుండగులను అదు పులోకి తీసుకొని కుషాయిగూడ పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

## డిసిఎం ఢీ ... విద్యార్థి మృతి

**చార్మినార్,సెప్టెంబరు 13 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో మదర్సాలో చదువుతున్న పదిహేను సంవత్సరాల వయస్సు గల ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన చాంద్రాయణ గుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం......పాతబస్తీ హఫీజ్ బాబానగర్‌కు చెందిన మునీరుద్దీన్ కుమారుడు జకీయుద్దీన్ (15) పాతబస్తీలోని ఓ మదర్సాలో చదువుచున్నాడు.శనివారం మునీరుద్దీన్ ఉద్యోగ నిమిత్తం వెళ్లాడు.మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంటి ఆవరణలో ఉన్న తండ్రి ద్విచక్ర వాహనాన్ని కుమారుడు జకీయుద్దీన్ తీసుకుని వెళ్లాడు.ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లవద్దని తల్లి ఎంత చెప్పిన జకీయుద్దీన్ వినలేదు.కాగా జకీయుద్దీన్ ద్విచక్ర వాహనంపై హఫీజ్ బాబా నగర్ నుంచి చాంద్రాయణగుట్ట వైపు ప్రయాణిస్తున్నాడు.అదే సమయంలో వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన డిసిఎం వాహనం జకీయుద్దీన్ నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది.ఈ సంఘటనలో తీవ్ర గాయాల పాలైన జకీయుద్దీన్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.ప్రమాదానికి కారుకుడైన డిసిఎం డ్రైవ ర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును చాంద్రాయణగుట్ట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అభివృద్ధి పనులకు కృషి : కార్పొరేటర్



గాయిత్రినగర్‌లో మంచినీటి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్.

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు పాదయాత్రలు నిర్వహించి సమస్యలు పరిష్కారాని కృషి చేయటం జరుగుతుందని అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని గాయిత్రినగర్ 60 ఫీట్ల రోడ్డు, హరిహర సమీపంలో, తులసీనగర్‌లో జలమండలి మేనేజర్ అన్విత్‌తో కలిసి పర్యటించారు. అవసరమైన చోట భూగర్భ డ్రైనేజీ పనుల కోసం తగిన విధంగా అంచనాలను తయారు చేయాలని సూచించారు. ఇప్పటికే డివిజన్ పరిధిలోని అన్ని బస్తీల కాలనీలలో స్థానిక ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు సహకారంతో కోట్లాది రూపాయల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సఫరా, ఆధునిక వసతులు అభివృద్ధి చేయటం జరిగిందని తెలిపారు. మిగిలివున్న సమస్యలను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేయిస్థామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాయిత్రి నగర్ అధ్యక్షులు కృష్ణారావు, సయ్యద్ నసీర్, నూర్‌ఖాన్, కొండమ్ సంపత్‌రెడ్డి, సాంయ్యగౌడ్, సంజీవరెడ్డి, కాశినాథ్‌చారి పాల్గొన్నారు.

### నేడే బ్రిగేడ్ సిటాడెల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి జరిగే బ్రిగేడ్ సిటాడల్ అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ ఆసోసియేషన్ ఎన్నికలు ఈనెల 14 ఆదివారం నిర్వహించనున్నారు. మొత్తం 1334 ప్లాట్లు ఉండగా అందులో సభ్యత్వ పొందిన వారికి మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. 1050 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో పోటీలో ఏహెచ్‌సీ ప్యానల్, కమ్యూనిటీ ఫస్ట్ ప్యానల్, ఫోర్త్ ఎస్టేట్ ప్యానలత్‌పాటు కొంతమంది ఇండిపెండెంట్‌గా కూడా పోటీ చేస్తున్నారు. అధ్యక్షుడిగా, ఉపాధ్యాక్షుడిగా, ప్రధాన కార్యదర్శులుగా, సంయుక్త కార్యదర్శులుగా, కోశాధికారులుగా, జాయింట్ కోశాధికారిగా, డైరెక్టర్స్‌గా 15 మంది పోటీలో ఉన్నారు. ఈ ఎన్నికలకు అధికారిగా సబ్‌రిజిస్ట్రార్ యూసుఫ్ అలీ ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటటల నుంచి సాయంత్రి 4 గంటల వరకు నిర్వహించి అదేరోజు ఎన్నికల ఫలితాలను వెల్లడిస్తారు.

### కాచి కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి

**- ఎంపీ బాబు సింగ్ కుష్వా**




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బాబు సింగ్ కుష్వా.

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని కాచి కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తర ప్రదేశ్ మాజీ మంత్రి, జోన్ పూర్ ఎం.పీ బాబు సింగ్ కుష్వా తెలిపారు. కాచి కులస్తులందరూ సంఘటితంగా ఉంటూ తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్వాన్ కాచి సంఘం అధ్యక్షులు సురేందర్ సింగ్ ఆధ్వర్యంలో శనివారం కార్వాన్ లోని కాచి సంఘ భవనంలో కాచి కులస్తుల సమస్యలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జోన్ పూర్ ఎం.పీ బాబు సింగ్ కుష్వా హాజరై మాట్లాడారు.. తెలంగాణలో కాచి కులస్తులు వెనుకబాటుకు గురి కావడం ఆవేదన కలిగించే విషయం అన్నారు. తెలంగాణలోని కాచి కులస్తులకు రిజర్వేషన్ ఫలాలు అందకపోవడంతోనే అభివృద్ధి చెందడం లేదనే విషయం నా దృష్టికి రావడం జరిగిందన్నారు. కాచి కులస్తులు బిసి (డి) నుంచి బీసీ(ఏ) లోకి మారితేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ విషయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణలో నామినేటెడ్ పదవులలో కూడా కాచి కులస్తులకు అవకాశం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ కాచి సంఘం అధ్యక్షులు బల్వీర్ సింగ్, తెలంగాణ కాచి సంఘం సలహాదారులు పురుషోత్తం సింగ్, కార్వాన్ కాచి సంఘం ఉపాధ్యక్షులు కుందన్ లాల్ సింగ్, సినోద్ సింగ్, అజయ్ సింగ్ సంఘం సభ్యులు తిలక్ సింగ్, చతుర్వేది సింగ్, సుభాష్ సింగ్, నితీష్ సింగ్, సోహన్ సింగ్, రాజేష్ సింగ్, రఘువీర్ సింగ్, ప్రీతం సింగ్ కాచి కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### వేధింపులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



తనకు జరిగిన అన్యాయంపై బుక్‌లెట్ విడుదల చేస్తున్న లెక్చరర్ సంజీవరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** తనను మానసికంగా వేధింపులకు గురిచేసిన హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, మరో ఇద్దరు ఉన్నతాధికారులపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలుగు లెక్చరర్ ఎన్. సంజీవరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్లో మాజీ ఎంఎల్‌ఏ శ్రీరాములు, రిటైర్డ్ హిందీ పండిట్ హరిహర నాథ్ గుప్తాతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తాను హాలియాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నానని తెలిపారు. అయితే, ప్రిన్సిపాల్ తనపై కక్షగట్టి కులపరంగా వేధిస్తున్నానంటూ ఫిర్యాదు చేయగా, ఉన్నతాధికారులు ఎలాంటి విచారణ చేపట్టకుండానే తనను వికారాబాద్‌కు బదిలీ చేశారని తెలిపారు. అక్కడ తెలుగు పోస్టు లేకపోవడంతో తాను హైకోర్టును ఆశ్రయించగా, బదిలీ ఉత్తర్వులను రద్దుచేస్తూ విచారణ జరిగే వరకు హాలియాలోనే విధులకు ఉత్తర్వులిచ్చిందన్నారు. హైకోర్టు ఉత్తర్వులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఐదున్నర నెలల కాలయాపన తర్వాత 2024 ఆగస్టు 5న తిరిగి పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు. తన విషయంలోనే కాదు మిగతా ఉద్యోగులను కూడా ప్రిన్సిపల్ వేధించారని ఆరోపించారు. కావున అతనిని విచారించి, తనకు న్యాయం చేయాలని వేడుకొన్నారు.

### నేడు పాతబస్తీలో మిలాద్ -ఉన్-నబీ ఊరేగింపు

**చార్మినార్,సెప్టెంబరు 13 ప్రభాతవార్త :** మిలాద్–ఉన్–నబీ ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీన పాతబస్తీలో ఊరేగింపును నిర్వహించనున్నామని మిలాద్ మర్కాజీ ఊరేగింపు జాయింట్ కన్వీనర్,ఖాద్రియా ఇంటర్నేషనల్ సొసైటీ అధ్యక్షులు ఖాద్రి తెలిపారు.పాతబస్తీ కాజీపురలో శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం 11 గంటలకు మిశ్రీగంజ్ దర్గా నుంచి ఊరేగింపు ప్రారంభమై చార్మినార్‌కు చేరుకుంటుందని తెలియజేశారు.చార్మినార్ వద్ద పలు ప్రాంతాలకు చెందిన ఊరేగింపులు కలుస్తాయని ఆయన తెలిపారు.ఊరేగింపులో గుర్రాలు,ఒంటెలు ఉంటాయని ఆయన తెలియజేశారు..

## ఈవిఎంలతో ప్రజాస్వామ్య పునాదులు బలహీనపడే ప్రమాదం

**హైదరాబాద్, సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** ఎన్నికల నిర్వహణలో ఇవిఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్) వ్యవస్థతో ప్రజాస్వామ్య పునాదులను బలహీనపరిచే ప్రమాదం ఉన్నదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో నిపుణుల హెచ్చరికలను ఇసిఐ పట్టించుకోకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కాన్ స్టిట్యూషనల్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ (సిఆర్‌పిసి) జాతీయ కన్వీనర్ సంగటి మనోహర్ అధ్యక్షతన ఇవిఎం వ్యతిరేక జాతీయ ఉద్యమంలో భాగంగా "ఇవిఎం వద్దేవద్దు.. బ్యాలెట్ పేపరే ముద్దు" అనే అంశంపై రౌండ్ టుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ డా.గాలి వినోద్ కుమార్, బిఎల్‌ఎఫ్ చైర్మన్ నల్ల సూర్యప్రకాశ్, రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు వి.జి.ఆర్. నారగోని, న్యాయవాది అమిన్ పిరా, బి.ఎన్.రత్న మీడియాతో మాట్లాడారు. ఇవిఎం హ్యాకింగ్, ట్యాంపరింగ్ లాంటి అడ్డదారుల్లో, అనైతిక, అనాగరిక, అప్రజాస్వామిక పద్ధతుల్లో గెలిచే తీరుకు స్వస్తిపలకాలని సూచించారు. నిస్వార్థ, నిజాయితీ, పారదర్శకత జవాబుదారీతనంతో కూడిన బ్యాలెట్‌తో ప్రజలు, ప్రజాస్వామ్యం గెలిచే ఎన్నికల కోసం పట్టుపట్టి ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. సంగటి మనోహర్ మాట్లాడుతూ ఇవిఎంల ప్రభావం, దుష్ఫలితాలు ప్రపంచ ప్రజాస్వామ్య దేశాలపై పడటం ఖాయమని, అందుకే వాటిని ఎక్కడేగాని వాడకుండా నిషేధించాలన్నారు. అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలు ఎందుకు ఇవిఎంలు వాడటం లేదో ఒకసారి ఆలోచించాలన్నారు. ఇవిఎం వ్యతిరేక జాతీయ ఉద్యమం అన్ని సమస్యలకు ప్రత్యామ్నాయమని, దీనిని మహోద్యమంగా మార్చుతామని తెలిపారు. సమావేశంలో మాల మహానాడు అధ్యక్షులు చెన్నయ్య, అన్వరన్, మాస్టర్జీ, మహేశ్వర్‌రాజు, వివిధ రంగాల, వర్గాల ప్రముఖులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదంచేస్తున్న గాలివినోద్‌కుమార్, నల్ల సూర్యప్రకాశ్, విజెఆర్ నారగోని, సంగటి మనోహర్, మహేశ్వర్‌రాజు తదితరులు

## జంట జలాశయాలకు తగ్గిన వరద ఉధృతి

**- నార్సింగి వద్ద తిరిగి తెరుచుకున్న ఔటర్ సర్వీసు రోడ్డు**

**నార్సింగి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త :** జంట జలాశయాలైన గండిపేట, హిమాయత్ సాగర్‌లకు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ఉధృతి తగ్గింది. శుక్రవారం హిమాయత్ సాగర్ జలాశయం వద్ద 4.గేట్లు 4.ఫీట్ల మేర ఎత్తి ఈసీ వాగులోకి 5354.క్యూసెక్కుల నీటిని వదిలి పెట్టారు. ఇన్‌ఫ్లో 4.వేలు ఉండేది. శనివారం వరద ఉధృతి తగ్గడంతో 2.గేట్లు మూసి వేశారు. ఇన్‌ఫ్లో 4.వేల నుంచి 500.క్యూసెక్కులకు తగ్గడంతో 2.గేట్లు 3.ఫీట్లు ఎత్తి ఈసీ వాగులోకి 1981.క్యూసెక్కుల నీటిని వదలి పెడుతున్నారు. అలాగే గండిపేట జలాశయంలో సైతం శుక్రవారం 6.గేట్లు 4.ఫీట్ల మేర ఎత్తి మూసీ నదిలోకి 2652.క్యూసెక్కుల నీటిని వదిలిపెట్టారు. శనివారం ఈ జలాశయంలోకి 1200.క్యూసెక్కుల ఇన్‌ఫ్లోకు పడిపోవడంతో 2.గేట్లు మూసి వేసివేశారు. 4.గేట్లను 3.ఫీట్ల మేర ఎత్తి 1352.క్యూసెక్కుల నీటిని మూసీలోకి వదులుతున్నారు. దీంతో వరద నీరు తగ్గడం వలన నార్సింగి ఔటర్ సర్వీసు వద్ద, మంచిరేవుల–నార్సింగి బ్రిడ్జి వద్ద రాకపోకలు పునరుద్దరించారు. ఈ రెండు బ్రిడ్జిల పైనుంచి శుక్రవారం వరద నీరు పారడం వలన పోలీసులు పికెట్ ఏర్పాటు చేసి, వాహనాల రాకపోకలను నిలిపి వేయడంతో నార్సింగి,మంచిరేవుల గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. మూసీ నది చల్లబడడంతో ఈ ప్రాంత ప్రజలు రెండు బ్రిడ్జిల పైనుంచి రాకపోకలు ప్రారంభించారు.

## 38 మిస్సింగ్ మొబైల్స్ యజమానులకు తిరిగి అందజేత

**చిక్కడపల్లి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** చిక్కడపల్లి క్రైం పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సాయంతో 38 మిస్సింగ్ మొబైల్ ఫోన్‌లను గుర్తించి శనివారం యజమానులకు తిరిగి అందజేశారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో స్థానిక డిఐ ఎం.శంకర్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ హాజరై మొబైల్ ఫోన్లను యజమానులకు స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక క్రైం పోలీసులు క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ ఎల్. రమేశ్‌కుమార్ మాట్లాడుతూ మొబైల్ పోయిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఐఎంఈఐ నంబర్ రికార్డు ఉంచుకోవాలని, సీఈఐఆర్ పోర్టల్ సాయంతో మిస్సింగ్ ఫోన్లను వేగంగా గుర్తించగలుగుతున్నామని తెలిపారు. మొబైల్ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ ఫోన్ అంటే ప్రాణం. ఇది మిస్ అయితే కలిగే ఇబ్బందులు అందరికీ తెలిసిందే. అయితే సరైన విధానం పాటిస్తే తిరిగి పొందడం సాధ్యమని చెప్పారు. తమ మిస్సింగ్ ఫోన్లు తిరిగి పొందిన బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ, వెంటనే చర్యలు తీసుకుని పారదర్శకంగా ఫోన్లు అందించినందుకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. డయల్ 100 కు కాల్ చేయడం ద్వారా లేదా తెలంగాణ పోలీసు వెబ్‌సైట్ లేదా మీ సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేయడం ద్వారా పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్‌లను వెంటనే నివేదించాలని ఆయన ప్రజలను కోరారు. ప్రజల ఆస్తులను రక్షించడమే తమ ప్రధాన ధ్యేయ మని, భవిష్యత్తులో కూడా ఇలాంటి చర్యలు కొనసాగుతా యని పోలీసులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది, బాధితులు తదితరులు పాల్గొన్నారు.



పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను యజమానులకు అందజేస్తున్న చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్

## మీరాలం ట్యాంక్ కేబుల్ బ్రిడ్జి రూట్ మ్యాప్‌ను మార్చాలి

**-బిల్డింగ్ ,ల్యాండ్ ఓనర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్**

**అత్తాపూర్ సెప్టెంబరు13,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతున్న మిర్యాలం ట్యాంక్ కేబుల్ బ్రిడ్జి రూట్ మ్యాప్‌ను మార్చాలని శివరాంపల్లి బిల్డింగ్ మరియు ల్యాండ్ ఓనర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం శివరాంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఈ కేబుల్ బ్రిడ్జ్ నిర్మాణం మరియు పార్కు ఏర్పాటు కోసం మా విలువైన ఇండ్లు, హాస్పిటల్ ఫంక్షన్ హాల్స్ ఇతర విలువైన వాణిజ్య సముదాయాలు కోల్పోవాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు నష్టం చేకూరే విధంగా ఉన్న ఈ ప్రాజెక్టును ఎందుకు నిర్మించాలని వారు ప్రశ్నించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వలన ఇక్కడ ఏర్పాటు చేసిన మీనా హాస్పిటల్లో ప్రతి సంవత్సరం రెండు లక్షలకు పైగా రోగులకు సేవలు అందించే 250 పడకల చారిటబుల్ హాస్పిటల్ ను కోల్పోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈ రూట్ మ్యాప్ లో రెసిడెన్షియల్ గ్రేటెడ్ కమ్యూనిటీలు అనేకం ఉన్నాయని దీని వలన ఎంతోమంది తమ ఇళ్లను కోల్పోవాల్సి పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ రూట్ మ్యాప్ ను జూ పార్క్ నుంచి కేబుల్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే భూ సేకరణ సమస్య తలెత్తదని వారు స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న రూట్ మ్యాప్ వలన చాలా భూసేకరణ చేయవలసి ఉంటుందని దీనివలన ఎంతోమంది భూమిని కోల్పోవాల్సి వస్తుందని ప్రాజెక్టు వ్యయం కంటే భూసేకరణకు వ్యయం చాలా ఎక్కువగా అవుతుందని వారు స్పష్టం చేశారు. జూ పార్క్ నుంచి రూట్ మ్యాప్ తీయడం వలన భూసేకరణ సమస్య అసలు ఉండదని దాని వలన ప్రభుత్వానికి ఖర్చు కూడా తక్కువ అవుతుందని వారు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం చాలా తక్కువగా ఉంటుందని దీనివలన ఎంతో విలువైన భూమిని మేము కోల్పోవాల్సి వస్తుందని అసోసియేషన్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం రూట్ మ్యాప్ ను మార్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




### మీ సమస్యకు అండగా నిలుస్తా : విజయారెడ్డి



విజయారెడ్డిని కలిసి తమ సమస్యను తెలియజేస్తున్న బస్తీవాసులు

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 13, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్ డివిజన్ గురుబ్రహ్మనగర్‌లో కొందరు ప్రైవేటు వ్యక్తులు రహదారి కోసం తమ గుడిసెలను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని బస్తీవాసులు శనివారం ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి. విజయారెడ్డిని దృష్టికి తీసుకెళ్లారు. తమ సమస్యను విన్నవించుకొనేందుకు వారంతా కార్పొరేటర్ కార్యాలయానికి వెళ్లి కలిశారు. గత కొద్ది రోజులుగా ప్రైవేటు వ్యక్తులు తమ గుడిసెలను తొలగించే ప్రయత్నం చేస్తూ తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీవాసులకు తాను అండగా నిలుస్తానని అన్నారు. ఆదివారం బస్తీలో పర్యటిస్తానని వారికి హామినిచ్చారు. బస్తీవాసులకు ఎలాంటి అన్యాయం జరగకుండా తాను ముందు నిలుస్తానని వారికి తేల్చిచెప్పారు.

### ఉద్యోగవకాశాల కల్పనకు విద్యాసంస్థల కృషి అభినందనీయం : వైస్‌చాన్స్‌లర్ కిషన్‌రెడ్డి



జెఎన్‌టియు వైస్‌చాన్స్‌లర్ టి.కిషన్‌రెడ్డిను సత్కరించిన దృశ్యం

**హైదరాబాద్ సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉద్యోగవకాశాల కల్పనకు విద్యాసంస్థలు చేస్తున్న కృషి విలువైనవని జెఎన్‌టియు వైస్‌చాన్స్‌లర్ టి. కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం అవంతి డిగ్రీ, పీజీ విద్యాసంస్థల స్నాతకోత్సవ సభ శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన టి.కిషన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. అవంతి విద్యాసంస్థలు ఆ దిశలో చర్యలు తీసుకోవడం ఎంతో గొప్పవన్నారు. బాగ్ అంబర్‌పేట బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి సిస్టర్ శ్రీలత వ్యక్తిత్వ వికాసం, భావోద్వేగాలను ఎలా అదుపులో పెట్టుకోవాలి అనే అంశాలపై ప్రసంగించారు. ప్రతి ఒక్కరు జీవితంలో వచ్చే ప్రతికూల అంశాలను సానుకూలంగా మలుచుకోవాలో వివరించారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రతి ఎం. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తమ విద్యాసంస్థలు దేశంలోనే మొదటి రెండువందల కళాశాలలో స్థానం సంపాదించారన్నారు. ప్రధాన కార్యదర్శి ప్రియాంక మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయాలు కళాశాలలోని బోధన గురించి వివరించారు. డాక్టర్ కె.లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ అవంతి విద్యార్థులు ఏఏ కంపెనీలలో ఎంత ప్యాకేజీ పొందారు తదితర వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హిందూ ఆంగ్ల పత్రిక ఉప సంపాదకులు రవికాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాకేశ్ మునక, విద్యాసంస్థల డైరెక్టర్(హెచ్‌ఆర్) డాక్టర్ వై.జయప్రద పాల్గొన్నారు.

### సంగీతం ద్వారా మానసిక ప్రశాంతత : లక్ష్మీకాంతశర్మ



**చిక్కడపల్లి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** సంగీతం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ రంగస్థల నటులు డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంతశర్మ అన్నారు. శనివారం సంకీర్తన సుధా వాహిని ద్వారా జరిగిన భక్తి సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. గాయని, గాయకులు చుందూరు సుజాత, సాయిరాం దంపతులు, స్నేహితులు సూర్య చంద్ర నాగేశ్వర రావు, సుజాత కుమారి, లక్ష్మీ శాంతి తదితరులు అద్భుతంగా గానం చేశారు.

## కామారెడ్డి డిక్లరేషన్‌లో గౌడ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

**హైదరాబాద్, సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** కామరెడ్డి బీసీ డిక్లరేషన్ కాంగ్రెస్ పార్టీ గౌడ్స్‌కి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కమిటీ చైర్మన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్,రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది.ఈ సమావేశానికి బిసి ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ మాజీ ఐఏఎస్ టి చిరంజీవులు, ఓబిసి బిజెపి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గందమల్ల ఆనంద్ గౌడ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్లు బీసీలకు ఇచ్చిన అన్ని హామీలను బేషరతుగా తక్షణమే అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లుగీత సొసైటీలకు 25 వైన్సులను కేటాయించాలని ,సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును జనగామ జిల్లాకు నామకరణం చేయాలన్నారు. అలాగే తాటిచెట్ల పైనుంచి పడి మరణించిన ,శాశ్వ వికలాంగులైన వారికి పది లక్షల ఎక్స్‌గ్రేషియాను తక్షణమే ఇవ్వాలని ఇప్పటికే పెండింగులో ఉన్న 13 కోట్ల 95లక్షలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి ఊర్లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కల్లుగీత సొసైటీకి ఇవ్వాలి, చెట్ల పెంపకానికి ప్రభుత్వం సహకరించాలన్నారు. అలాగే 50 సంవత్సరాలు పైబడిన కలుగీత వృత్తిదారులకు ఐదువేల రూపాయలు పెన్షన్ తక్షణమే అమలు చేయాలన్నారు. కల్లుగీత కార్పొరేషన్ కు నిధులు కేటాయించి గౌడ యువత ఉపాధికి సహకరించాలని బిసి బందులోగౌడును అన్ని రకాలుగా ఆదుకోవాలని లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు..ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గౌడ ఐక్యసాధన సమితి అంబాల నారాయణ గౌడ్. బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్. దుర్గయ్య గౌడ్,యువ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు సంపత్ గౌడ్, రెస్టారెంట్ బార్,అడ్ రెస్టారెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ గౌడ్,తాళ్ళ శ్రీశైలం గౌడ్, చీకటి ప్రభాకర్ గౌడ్, సింగం నాగేశ్వర్ గౌడ్, గోద వెంకటేష్ గౌడ్, కేశమోని శ్రీనివాస్ గౌడ్, బంటారం యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న విజయ్‌కుమార్‌గౌడ్, వెంకన్నగౌడ్, బాలరాజుగౌడ్, ఆనంద్‌గౌడ్, చిరంజీవులు, నారాయణగౌడ్ తదితరులు

### ఐక్యంగా సామాజిక వర్గ అభ్యున్నతికి పాటు పడదాం

**వడ్డెర సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు వేముల లక్ష్మణ్**



కొత్తగా నియమితులైన వారితో వేముల లక్ష్మణ్, గుంజా శ్రీనివాస్, అశోక్ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 13,ప్రభాతవార్త:** వడ్డెర సామాజిక వర్గం ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించుకుంటూ సామాజిక అభ్యున్నతికి పాటుపడదామని అఖిలభారత వడ్డెర సంక్షేమ సేవా సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం సంఘం కార్యాలయంలో వడ్డెర సంఘాన్ని బలోపేతం చేసేందుకు కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ఆయన ప్రకటించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి గా గుంజా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా అశోక్, జాతీయ సంయుక్త కార్యదర్శిగా మొక్కల శేఖర్, యువజన అధ్యక్షుడిగా డాక్టర్ వేముల లోకేష్, యువజన కార్యదర్శిగా డాక్టర్ వేముల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శిగా వేముల మధుసూదన్ లను నియమించినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఉన్న వడ్డెరలను ఐక్యం చేసి సామాజిక వర్గం సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామని అన్నారు. పేదరికంలో మగ్గుతున్న వడ్డెరలను సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల ద్వారా అన్ని రంగాలలో అభివృద్ధికి కృషి చేసేందుకు కార్యవర్గం శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు.

### దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జిపై అవగాహన నడక




సెప్సిస్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 13, ప్రభాతవార్తః** ప్రపంచ సెప్సిస్ డే సందర్భంగా ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్(ఐఎస్‌సీసీఎం) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జిపై అవగాహన నడకను నిర్వహించారు. 'సెప్సిస్‌ను ఆపండి–ప్రాణాలను కాపాడండి' అనే అంతర్జాతీయ అంశంతో ఈ నడకను కొనసాగించారు. ఈ సందర్భంగా ఐఎస్‌సీసీఎం హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ మణిమాల రావుతోపాటు డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ చందన, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ శ్వేత తదితరులు మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా సెప్సిస్ ఎవరికైనా రావచ్చని, అది వేగంగా విస్తరిస్తుందన్నారు. శరీరంలో ఏదైనా ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు దానిపై మరో రోగ నిరోధక శక్తి అతిగా స్పందిస్తే వచ్చే ప్రాణాంతక పరిస్థితే సెప్సిస్ అన్నారు. సమయానికి చికిత్స చేయకుంటే ఇతర అవయవాలపై దీని ప్రభావం పడుతుందన్నారు. సరైన అవగాహన, సమయానికి చికిత్స చేయడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా సెప్సిస్‌పై వాస్తవాలు, నిరోధక చర్యలు, నియమాలతో కూడిన సమాచార బ్రోచర్లను ప్రజలకు అవగాహన నిమిత్తం పంపిణీ చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

### నృత్య ప్రదర్శనలో వర్షిణికి బాల రత్న,బెస్ట్ డ్యాన్సర్ అవార్డు



బాల రత్న,బెస్ట్ డ్యాన్సర్ అవార్డు అందుకున్న సి.వర్షిణితో లార్డ్‌వెన్స్ హైస్కూల్ కరస్పాండెంట్ దీపక్ కుమార్,తల్లి దండ్రులు ప్రవీణ్ కుమార్,మధుసుధ

**చార్మినార్,సెప్టెంబరు 13 ప్రభాతవార్త :** నృత్య ప్రదర్శనలో శ్రోతలను ముగ్దుల్ని చేసిన ఘాన్సీ బజార్‌లోని లార్డ్ వెన్స్ మోడల్ హైస్కూల్‌కు చెంది నాలుగువ తరగతి విద్యార్థిని సి.వర్షిణికి బాల రత్న బెస్ట్ డ్యాన్సర్ అవార్డు లభించింది.జగిత్యాలలోని విరుపాక్ష ఫంక్షన్ హాల్‌లో గాన కోకిల కళానికేతన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలోమాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి,ఎమ్మెల్సీ ఎల్.రమణ, సినీ ఆర్టిస్ట్ శివారెడ్డి,కళానికేతన్ వ్యవస్థాపకులు ఎలిగేటి రాజేంద్ర ప్రసాద్,అధ్యక్షులు రవి కుమార్‌లు కలిసి సి.వర్షిణికి బాల రత్న బెస్ట్ డ్యాన్సర్ అవార్డును ప్రధానం చేశారు.ఈ సందర్భంగా విద్యావేత్త,లార్డ్‌వెన్స్ హైస్కూల్ కరస్పాండెంట్ దీపక్ కుమార్ మాట్లాడుతూ నృత్య ప్రదర్శనలో వర్షిణి ప్రతిభను కనపరిచి అందరిని ఆకట్టుకుందని,అవార్డు లభించటం అభినందనీయమని తెలిపారు.కార్యక్రమంలో దీపక్ కుమార్,వర్షిణి తల్లిదండ్రులు సి.ప్రవీణ్ కుమార్,మధుసుధ పాల్గొన్నారు.

### జాబ్ మేళాకు అనూహ్యస్పందన

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** విద్యార్థులకు విలువలతో కూడిన పరిశ్రమకు దగ్గా నైపుణ్యం అందించేందుకు టెక్స్‌అకాడమీ సంస్థ ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తుందని అ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ జహీరుద్దీన్ తెలిపారు. శనివారం బాలంరాయిలోని క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన జాబ్ మేళాలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిం చారు. దేశంలో అభివృద్ధి సంస్థల్లో టెక్స్‌అకాడమీ ఒకటని తెలిపారు. డిగ్రీ, డిప్లొమో, ఇంజనీరింగ్ చదివిన విద్యార్థుల కు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు ఇచ్చుటకు ప్లేస్ మెంట్ ఆఫ ర్లు ఇస్తున్నామన్నారు. 14 సంవత్సరాల నుంచి నిర్వహిస్తు న్న టెక్స్‌అకాడమీ ఆధ్వర్యంలో నాలుగు రాష్ట్రాల్లో 8 శాఖల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.

### ఫోర్జరీ డ్యాకుమెంట్స్‌తో ప్లాట్ అమ్మేందుకు యత్నం

**- గెజిటెడ్ అధికారి అరెస్ట్**

**అత్తాపూర్ సెప్టెంబరు13 ,ప్రభాతవార్త :** మృతి చెందిన మహిళ పేరుతో పోర్జరీ డాక్యుమెంట్ సృష్టించి స్థలం అమ్మెందుకు యత్నించిన ప్రభుత్వ గెజిటెడ్ అధికారితో పాటు మరో వ్యక్తిని పోలీసులు ఆరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో వివరాల ప్రకారం... మెహిదిపట్నం ప్రాంతానికి చెందిన ఆయేష సుల్తానాకు రాజేంద్రనగర్‌లోని బుద్వేల్ గ్రామంలో సర్వే నెంబర్ 95లోని ప్లాట్ నెంబర్ 520లో 277 గజల స్థలం ఉంది. కాగా ఆయేష 2019లో మృతి చెందాడంతో ఆ ప్లాట్ వద్దకు ఎవరు రాక పోవడంతో స్థానిక రియల్ వ్యాపారులు దానిని కబ్జా చేసేందుకు యత్నించారు. మద్య వర్తుల ద్వారా విషయం తెలుసుకున్న ములుగు జిల్లా ఆగ్రికల్చర్ విశ్వ విద్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న నవీదుల్ హాఫీజ్, రియల్ వ్యాపారి ఉబేద్ బిన్ మెహ్మద్ కలిసి తన కుంటుంబ సభ్యులపై పోర్జరీ డాక్యుమెంట్‌ను సృష్టించారు. ఓ మహిళతో ఆ స్థలాన్ని ఎలాంటి చెల్లింపులు లెకుండా పవర్ ఆఫ్ ఆథర్టి డ్యాకుమెంటను తయారు చేశారు. దీని ఆధారంగా ఆ ఆస్తిని 2024లో జహంగీర్ అనే వ్యక్తి ఇతరుల అమ్మకాలు చేశారు. విషయం తెలుసుకున్న ఆయేష కొడుకు మొహమ్మద్ ఇమియాజ్ హుస్సేన్ రాజేంద్రనగర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దార్యప్తు చేసి ఆసలు దోషులైన నవీదుల్ హాఫిజ్,ఉబేద్బిన్ మెహమ్మద్‌లను ఆరెస్ట్ చేశారు. ఈ కేసుతో ప్రమేయం ఉన్న మరో ముగ్గురు పరారిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

### విద్యార్థినులను వేధిస్తున్న నిందితులు అరెస్టు

**గోషామహల్,సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసిస్తూ హాస్టల్స్‌లో ఉండే విద్యార్థినులను వేధిస్తున్న నిందితులను సుల్తాన్‌బజార్ పోలీసులు అదుపులోకితీసుకుని కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.ఇన్‌స్పెక్టర్ నర్సింహ్మా కథనం ప్రకారం సుల్తాన్‌బజార్‌అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ మట్టయ్య పర్యవేక్షణలో చాకిలి ఐలమ్మ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్దుల సెల్‌ఫోన్ల నెంబర్లను ఇతరుల ద్వారా కరీంనగర్ నవాబ్‌కు చెందిన పిల్లి శ్రీనివాస్(23),వృత్తి రీత్యా డ్రైవర్,సురంపల్లి వెంకటేశ్వరల(19),వరంగల్ అర్బన్‌కు చెందిన సముద్రాల హారీష్(25) బోరబండలో నివాసం ఉంటున్నారు.ఈ ముగ్గురు కలిసి ఇతరు ద్వారా విద్యార్దులను సెల్‌ఫోన్ల నెంబర్లు సేకరించివాట్సాప్ కాల్స్‌ద్వారా,విద్యార్దీనుల వైవాహిక స్థితి,ఆరోగ్యసమస్యలు,సున్నితమైన గైనకాలజీ సంబంధితప్రశ్నలు అడిగి,చెకప్‌కోసం మియాపూర్,దిల్‌సుఖ్‌నగర్,కూకట్‌పల్లి ప్రాంతాలకు రమ్మని వత్తిడి తీసుకువస్తున్నారు.ఆరోగ్య పరీక్షల పేరిట విద్యార్దులను మభ్యపెట్టే ప్రయత్నంలో నిరంతరం వేధిస్తూ, తప్పుడు సందేశాలను పంపించడం జరుగుతుందన్నారు.హాస్టల్ నుండి 20మంది విద్యార్దీనులు కనిపించడంలేదని అబద్దపు ప్రచారం జరిగిందన్నారు.వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం విద్యార్దీనుల వ్యవహారాల డైరెక్టర్ వినితాపాండే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించగా ముగ్గురు యువకుల సెల్‌ఫోన్లుద్వారా వస్తున్న మెసెజీలు,వాట్సాప్ కాల్స్‌ను గుర్తించి అదుపులోకి తీసుకుని సెక్షన్78(2),79బిఎన్‌ఎస్ ,72ఐటి యాక్టుకింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా ఆ ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.కేసును చేధించడంలో ఇన్‌స్పెక్టర్ కుంభం నర్సింహ,డిటెక్టవ్ ఇన్‌స్పెక్టర్ పి.ధర్మారావు, ఎస్‌ఐలు సాయిరాం,ఎండి.ముజ్తబాఅలీ,పోలీసు సిబ్బందిని సుల్తాన్‌బజార్ అసిస్టెంట్ కమీషనర్ ఎం.మట్టయ్య అభినందించారు.ఈ కేసును సుల్తాన్‌బజార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### మహిళతో గొడవ.. రూ. 7లక్షల బ్రేస్‌లెట్ మాయం

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 13, ప్రభాతవార్తః** కారులో ప్రయాణిస్తున్న ఒక మహిళతో దురుసుగా ప్రవర్తించిన ముగ్గురిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నేమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. కోకాపేట ప్రాంతానికి చెందిన ఒక ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యజమాని అంజలీరావు జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45లో తన కారులో ప్రయాణిస్తున్నారు. శుక్రవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో రోడ్ నంబరు 45లో ఎలక్ట్రిక్ స్కూటీపై వచ్చిన వాహనదారుడు ఆమె కారును ఢీకొట్టడంతో కారు వెనుక భాగం దెబ్బతింది. పారిపోవడానికి ప్రయత్నించిన వాహనదారుడి వాహన తాళం చెవులను ఆమె తీసుకొంది. దీంతో ఆగ్రహించిన వాహన డ్రైవర్ ఆమెను నెట్టివేయగా మరో కారుపై పడింది. దీంతో కారులో ఉన్న మహిళ కిందకు దిగడంతో గొడవ పెద్దదైంది. అదే సమయంలో మరో వాహనదారుడు సైతం అంజలీరావుతోగొడవకు దిగాడు. తాళం చెవులు ఇవ్వాలంటూ ఒత్తిడి చేశాడు. వాహనదారుడు మహిళతో అసభ్యంగా ప్రవర్తించి ఆమె నుంచి తాళం చెవులను లాక్కొన్నాడు. గొడవ అనంతరం గమనించగా అంజలీరావు చేతికి ఉన్న రూ. 7లక్షల విలువైన బ్రేస్‌లెట్ కనిపించలేదు. దీంతో ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులువాహనదారుడు, మహిళతోపాటు, మరో వాహనదారుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వాహన తనిఖీలలో పట్టుబడ్డ నిషేదిత గుట్కా ప్యాకెట్లు

**ఇద్దరి పై కేసు నమోదు.**

**బేగంపేట సెప్టెంబరు 13,ప్రభాతవార్త** వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు నిషేదిత గుట్కా ప్యాకెట్లను పాన్‌షాప్‌లకు తరలిస్తున్న ఇరువురిని బేగంపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి నిషేదిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ సంఘటనపై బేగంపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బేగంపేట పోలీసుస్టేషన్ పెట్రో కారు 1లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై షేక్ షఫీ తన సిబ్బందితో శ్యామలాల్ బిల్డింగ్ హెచ్ పీ పెట్రోలు పంపు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు.ఈ సమయంలో టీజీ 12ఏ 0281హోండా యాక్టివాపై ఇద్దరు వ్యక్తులు అక్కడికి చేరుకున్నారు.ఈ సమయంలో వాహనం లో ఉన్న బ్యాగులో ఏమున్నాయంటూ ప్రశ్నించారు.వారు అనుమానంగా సమాధానం చెప్పడంతో బ్యాగు తెరచి చూడగా అందులో నిషేదిత గుట్కా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు.ఈ సంఘటనలో నిందితులైన భవానీనగర్ తలాబ్ కట్ట కు చెందిన ఈది బజార్‌కు చెందిన పాన్ మసాలా సప్లైయర్ సయ్యద్ మహామూద్ (56), ఛాంద్రాయణగుట్ట జీఎం కాలనీకి చెందిన అబ్దుల్లాబిన్ ఆలీ(49) లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ శ్రావణ్‌కుమార్ తెలియజేసారు.

## ఎంపి ఈటలని కలిసిన రైల్వే స్టేషన్ సాధన సమితి సభ్యులు



మల్కాజిగిరిసెప్టెంబర్ 13, ప్రభాతవార్త:
మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్ ని మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో ఆనందబాగ్ రైల్వే స్టేషన్ సాధన సమితి సభ్యులు కలిశారు.ఈ సందర్భంగా మల్కాజ్గిరి పార్లిమెంట్ పరిధిలో అనేక ఆర్. యూ.బి మరియు ఆర్.ఓ బి పనులను చొరవతో, 100 కేంద్ర ప్రభుత్వ నిధులతో ముందుకు తీసుకెళ్తున్నందుకు ధన్యవాదాలు తెలియచేసారు.అదే విధంగా ఆనందబాగ్ లో రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి చెయ్యాలని కోరారు. ఆనందబాగ్ లో ఎం.ఎం.టీ.ఎస్ స్టేషన్ ప్లాట్ఫారంపనులకు 5 లక్షలు రూపాయలను సమితి కోరిక మేరకు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అదనంగా మరింత సహాయం భవిషత్తు లో చెస్తా అని ఎం. పి శ్రీ ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్, జెఆర్యుసిసి సభ్యులు నూర్, శాస్త్రీ, నాగేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



మల్కాజిగిరిసెప్టెంబర్ 13, ప్రభాతవార్త:
గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ జోనల్ కమిషనర్ రవికిరణ్ కలిసి వినతి పత్రం అందజేశారు.సానుకూలంగా స్పందించిన జూనియర్ కమిషనర్ నిధుల మంజూరుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు కార్యక్ర మంలో టిఆర్ఎస్ నాయకులు మేకల రామ్ యాదవ్ విజయ్ ఉన్నారు

### తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో వాస్తవాలు, వక్రీకరణాలు




తుర్కయంజాల్ సెప్టెంబర్ 13, ప్రభాతవార్త
తుర్కయంజాల్లోని అరుణ కన్వెన్షన్ హాల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం - వాస్తవాలు, వక్రీకరణలు" అనే అంశంపై టిఎస్యుటిఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్ గారి అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఆవాజ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు అబ్బాస్ హాజరై, శనివారం వారు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విశిష్టతను, ఆనాడు కమ్యూనిస్టులు చేసిన త్యాగాలను, భూస్వాముల అణచివేతల నుండి ప్రజలను రక్షించడానికి, నిజాం ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా సాగిన పోరాటాలను సవివరంగా ప్రస్తావించారు. నిజాం ప్రభుత్వం మరియు రజాకారుల దురాగతాలను కూలంకషంగా వివరించారు. మేధావులు మౌనంగా ఉంటే చరిత్రను వక్రీకరించే అవకాశం ఉంటుందని, ప్రజలకు అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టిఎస్యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగయ్య , సిఐటియు రంగారెడ్డి జిల్లా నాయకులు పగడాల యాదయ్య , టిఎస్యుటిఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, ఉపాధ్యక్షులు బింగి రాములయ్య , రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుగంధ, సిఐటియూ నాయకులు కిషన్ , మహేశ్వరం మండలాధికారి కసనా నాయక్ , స్టడీ సర్కిల్ కన్వీనర్ బొడ్డుపల్లి రాములయ్య , జిహెచ్ఎం శ్రీనివాసులు సహా అనేక మంది నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆచార్యుడు తులసి వెంకట రమణ చార్యుకు ఘన సన్మానం



నేరెడ్ మెట్, సెప్టెంబర్ 13,ప్రభాతవార్త:
ఉస్మానియా విశ్వవిద్యాలయం ఓరియంటల్ విభాగం నుంచి డాక్టరేట్ అవార్డు అందుకున్న ఆచార్యుడు, కవి, విమర్శకులు శ్రీ తులసి వెంకట రమణ చార్యులు ఘన సన్మానం పొందారు. ఆచార్య డాక్టర్ మసన చెన్నప్ప రచనలు పరిశీలన అనే అంశంపై పరిశోధన సిద్ధాంత గ్రంథం సమర్పించి డాక్టరేట్ డిగ్రీ సాధించిన సందర్భంగా, నేరెడ్ మెట్ కు చెందిన శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శివ శ్రీ నిర్మల అంబికానాధ శర్మ, సంధ్య దంపతులు ఆనంద్బాగ్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని ఉప ఆలయం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శర్మ దంపతులు మాట్లాడుతూ- తులసి వెంకట రమణ చార్యుల పరిశోధన, సాహిత్య సృష్టి యువతకు ఆదర్శం. సంస్కృత సాహిత్యం వ్యాప్తికి ఆయన కృషి విశేషం" అని కొనియాడారు. అక్షరకౌముది సేవా సంస్థ అధ్యక్షుడిగా, ఆచార్యుడిగా చార్యుల కృషి భవిష్యత్ తరాలకు మార్గదర్శకమని శుభాకాంక్షలు తెలిపారు.

### కారు కిరాయి మాయ..రూ.2.80 కోట్ల మోసం

నేరేడ్మెట్, సెప్టెంబర్ 13:ప్రభాతవార్త : నకిలీ వాగ్దానాలతో ప్రజలను మోసగించి కోట్ల రూపాయలు కాజేసిన మోసగాడిని నేరేడ్మెట్ పోలీసులు పట్టుకున్నారు. ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం- నేరేడ్మెట్ బలరాం నగర్కు చెందిన టేకి క్రాంతి కుమార్ "హ్యాపీ గ్రూప్ ఆఫ్ కంపెనీ" పేరుతో ఒక సంస్థ నడుపుతూ, కొత్త కార్లు తక్కువ ధరలకు ఇప్పి స్తానని బాధితులను నమ్మించాడు. కార్లను ఒక సాఫ్ట్వేర్ కంపెనీకి కిరాయికి పెట్టి నెలకు 50 వేలు ఇస్తానని చెప్పి సుమారు 27 మందివద్ద నుండి రూ.2.80 కోట్లు వసూలు చేసుకున్నాడు.కానీ వాగ్దానాలు నిలబెట్టుకోకుండా, కార్లు ఇవ్వకుండా, కిరాయిలు చెల్లించకుండా పారిపోయాడు. బాధితుల ఫిర్యాదులపై మేరకు నేరేడ్మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టి, చివరకు టేకి క్రాంతి కుమార్ను పట్టుకొని రిమాండ్ కు తరలించారు.



ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు దృశ్యం.

## తెలంగాణ హ్యాండ్బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్రెడ్డి రాంరెడ్డి ఎన్నిక



మల్రెడ్డి రాంరెడ్డిని సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఎల్బినగర్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త: తెలంగాణ హ్యాండ్బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తపేటలో జరిగిన అసోసియేషన్ కార్యనిర్వాహక సంఘం, సాధారణ సభ్యుల సమావేశంలో మల్రెడ్డి రాంరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నారని, రాష్ట్రంలో కొత్తగా స్పోర్ట్స్ యూనివర్సిటి నిర్మాణం జరుగుతుందని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, క్రీడాశాఖతో కలిసి పనిచేస్తామని అన్నారు. హ్యాండ్బాల్ క్రీడలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులకు శిక్షణ, సౌకర్యాలు కల్పించేలా తన వంతు కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో అసోసియేషన్ భవిష్యత్తు కార్యచరణ గురించి చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా హ్యాండ్బాల్ను మరింత ప్రోత్సహించడం, శిక్షణ శిబిరాలు నిర్వహించడం, గ్రామీణ పట్టణ ప్రాంతాల యువతను క్రీడల వైపు ఆకర్షించడం వంటి అంశాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సోలిపురం వెంకట్రాంరెడ్డి, కార్యదర్శి సి.తిరుమల్రెడ్డితో పాటు వివిధ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు సాంబశివ రావు, శ్యామల పవన్ కుమార్, కనపర్తి రమేష్, రామలింగం, బి.లక్ష్మం, ప్రభాకర్, సంజీవ్ కుమార్, శ్రీనివాస్రెడ్డి, పి.సురేందర్, విజయ్ బాబు, మల్లేష్, సి.పుల్లయ్య, ఆర్.శంకర్ నాయక్, హెచ్ఎఫ్ఐ పరిశీలకుడు శ్యామ్ సుందర్రెడ్డి, రిటర్నింగ్ ఆఫీసర్ శ్యామ్ ప్రసాద్, ఏఎంసి డైరెక్టర్ పన్యాల జైపాల్రెడ్డి, అరుణ్ అంబేద్కర్, శ్యామ్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాణి మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న కరస్పాండెంట్, సెక్రెటరీ సుభాష్ గౌడ్

మలక్ పేట ,సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:
మలక్ పేటలోని శ్రీ వాణి డిగ్రీ మహిళా కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే, ప్రెషర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మలక్పేట లోని సిమ్లా గార్డెన్స్ లో జరిగిన గ్రాడ్యుయేషన్ డే, ఫ్రెషర్స్ డే వేడుకలకు శ్రీవాణి డిగ్రీ మహిళా కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ సుభాష్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు నిపుణులైన అధ్యాపకులతో విద్యాబోధనను అందిస్తున్నామని అన్నారు. కళాశాలలో విద్యార్థుల కోసం అత్యాధునిక సౌకర్యాలు కలిగిన ల్యాబ్ తో పాటు లైబ్రరీ కూడా ఏర్పాటు చేయడం జరిగిందనీ తెలిపారు. విద్యాబోధన తో పాటు నైతిక విలువలను కూడా పెంపొందిస్తున్నామని, విద్యార్థులు క్రమశిక్షణను పాటిస్తూ తరగతులకు తప్పనిసరిగా హాజరవ్వాలని ఆయన సూచించారు. ఎంచుకున్న అంశాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకొని మంచి ఉద్యోగాలను పొందాలని అన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కమ్యూనికేషన్ స్కిల్స్ ను , సృజనాత్మకతను పెంపొందించుకోవాలని, సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని అన్నారు. ఆలోచనలను కార్యరూపంలో అమలుపరచాలని, కష్టపడే తత్వం ఉన్నవారు తప్పక ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆయన పేర్కొన్నారు. అత్యుత్తమ అధ్యాపక బృందంతో ఆధునాతన పద్ధతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తున్నామని వివరించారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక దృష్టిని సారిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతనంగా తీర్చడానికి పునాది వేస్తున్నామని తెలిపారు. అనంతరం శ్రీవాణి విద్యాసంస్థల చైర్మన్ ఆర్. రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం ఆసక్తి ఉన్న రంగాలను ఎంచు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విమలా రెడ్డి, అధ్యాపకులు అనుప్రియ, గిరిధర్, జాన్, హామీదుల్లా ఖాన్, రాములు, కార్తికలాల్, శ్రీలక్ష్మీ, బిందు, దామిని తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్లో విజయవంతంగా జోనల్ స్థాయి క్రీడోత్సవాలు



ఉప్పల్ జోనల్ స్థాయి స్కూల్ గేమ్స్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న మండల విద్యాధికారి రామరావు, జోనల్ కార్యదర్శి పద్మావతి తదితరులు

ఉప్పల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త : ఉప్పల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలో 69వ ఉప్పల్ జోనల్ స్థాయి స్కూల్ క్రీడోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆఫ్ ఇండియా, ఎస్ జి ఎఫ్ ఐ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి ఖో ఖో, కబడ్డీ,వాలీబాల్ క్రీడా పోటీలు ఈనెల 8వ తేదిన ప్రారంభించారు. ఈ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో వివిధ విభాగంలో 90 టీంలు పాల్గొన్నట్లు జోనల్ కార్యదర్శి పద్మావతి తెలిపారు. ఈ క్రీడా పోటీలను టోర్నమెంట్ మరియు సెలెక్షన్స్ పద్ధతిలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు, ఉప్పల్ స్కూల్ హెచ్ఎం శిరీష ముఖ్య అతిధులుగా పాల్గొని విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్లో జోనల్ స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగాయని, త్వరలో జరిగే జిల్లా స్థాయి టోర్నమెంట్లో ఉత్తమ ప్రదర్శన చేయాలని విద్యార్థులు, వ్యాయమ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రైవేటు స్కూల్ పిల్లలతో పాటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో రాణిస్తున్నారని, ముఖ్యంగా జడ్పీహెచ్ఎస్ నాగోల్, జడ్.పి.హెచ్.ఎస్ ఉప్పల్ స్కూల్ విద్యార్థులు అతి ఉత్తమంగా ప్రదర్శన చేశారని అభినందించారు. విజేతలను జోనల్ సెక్రటరీ పద్మావతి సత్కరించారు.కాగా కబడ్డీ విభాగంలో సీనియర్ బాలురు విభాగంలో జెడ్ పి హెచ్ ఎస్ నాగోల్ మొదటి బహుమతి సాధించగా, రెండవ బహుమతి సత్య సాయి స్కూల్ కైవసం చేసుకుంది. సీనియర్ బాలికల విభాగంలో జడ్.పి.హెచ్.ఎస్ నాగోల్ రెండవ బహుమతి, సెయింట్ జాన్స్ స్కూల్ రామంతపూర్ సాధించారు. జూనియర్ బాయ్స్ విభాగంలో మొదటి బహుమతి ఇందిరా హై స్కూల్ నాచారం, రెండవ బహుమతి జడ్పీహెచ్ఎస్ నాగోల్ సాధించారు. జూనియర్ గర్ల్స్ క్యాటగిరి లో మొదటి బహుమతి సెయింట్ జాన్స్ స్కూల్ రామంతపూర్ రెండవ బహుమతి సెయింట్ జాన్స్ స్కూల్ నాగోల్ సాధించారు. ఖో ఖో ఆటలో సీనియర్ బాలుర విభాగంలో మొదటి బహుమతి మోడ్రన్ హైస్కూల్ , రెండవ బహుమతి సాగర్ గ్రామర్ హై స్కూల్ సాధించారు. సీనియర్ బాలికల విభాగంలో మొదటి బహుమతి మోడరన్ హై స్కూల్, రెండో బహుమతి సెయింట్ జాన్స్ రామంతపూర్ సాధించారు. జూనియర్ బాయ్స్ కేటగిరీలో మొదటి బహుమతి మోడ్రన్ హై స్కూల్ రెండో బహుమతి జడ్పీహెచ్ఎస్ ఉప్పల్ సాధించారు. జూనియర్ బాలికల కేటగిరీలో మొదటి మోడ్రన్ హై స్కూల్, రెండవ బహుమతి జడ్.పి.హెచ్.ఎస్ ఉప్పల్ సాధించారు. వాలీబాల్ ఆటలో సీనియర్ బాలుర కేటగిరీలో మొదటి బహుమతి జడ్.పి.హెచ్.ఎస్ ఉప్పల్, రెండవ బహుమతి మదర్ థెరిసా సాధించారు. సీనియర్ బాలికల కేటగిరీలో మొదటి బహుమతి జడ్.పి.హెచ్.ఎస్ ఉప్పల్, రెండో బహుమతి మోడ్రన్ హై స్కూల్ సాధించారు. జూనియర్ బాలుర కేటగిరిలో మొదటి బహుమతి జడ్.పి.హెచ్.ఎస్ నాగోల్, రెండవ బహుమతి జడ్.పి.హెచ్.ఎస్ ఉప్పల్ సాధించారు. జూనియర్ బాలికల కేటగిరీలో మొదటి బహుమతి జడ్.పి.హెచ్.ఎస్ ఉప్పల్, రెండవ బహుమతి జడ్.పి.హెచ్.ఎస్ నాగోల్ సాధించారని జోనల్ సెక్రటరీ జి పద్మావతి, పిడి శంకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగోల్ పిడి శంకర్, మమత, సురేష్, అంజలి, రాఘవేంద్ర, ఉప్పల్ జోనల్ కోచ్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎస్ఎన్డిపి నాలాల నిర్వహణలో అధికారులు సమన్వయం చేసుకోవాలి : నవారు మల్లారెడ్డి



నవారు మల్లారెడ్డికి ఎస్ఎన్డిపి నాలా సమస్యలు, ప్యాచ్వర్కులకు నోచని రోడ్ల సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

సరూర్నగర్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త: బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లోని అల్మాస్గూడ డివిజన్లో మురుగు నీరు, వరద ముంపు సమస్యల పరిష్కారం కోసం నిర్మించిన ఎస్ఎన్డిపి నాలాల నిర్వహణ విషయంలో కార్పొరేషన్ అధికారులు, ఎస్ఎన్డిపి అధికారులు సమన్వయం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి సూచించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎస్ఎన్డిపి నాలాల నిర్వహణ లేకపోవడంతో మురుగు నీరు, మట్టి, బురదతో నిండి రోడ్లపై ప్రవహిస్తున్న అల్మాస్గూడ నాలుగవ డివిజన్లోని మధురాపురి, న్యూ మధురాపురి, అమరావతి కాలనీల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి ఆయా కాలనీల్లో ఎస్ఎన్డిపి నాలాల నిర్వహణ లేకపోవడంతో ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను పరిశీలించారు. స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, కాలనీవాసులు, పలువురు మహిళలు సైతం ఆయనను కలిసి సమస్యలు వివరించారు. నాలాల్లోకి వర్షపు నీటితో పాటు వచ్చిన మట్టి, బురదను తొలగించకపోవడంతో నాలాలు నిండి వరద నీటితో పాటు డ్రైనేజీ నీరు రోడ్లపై ప్రవహించడమే కాకుండా ఇళ్ళల్లోకి వస్తున్నదని వారు మల్లారెడ్డి దృష్టికి తెచ్చారు. అయితే తమకు ఇబ్బందులు కలుగుతుండడంతో సమస్యను బడంగ్పేట్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తెస్తే వారు నాలాల పూడిక తీత తమకు సంబంధం లేదని సమాధానమిస్తున్నారని తెలిపారు. దీంతో రోజు రోజుకీ సమస్యలు తీవ్రమవుతున్నాయనీ ముఖ్యంగా వర్షాలు కురిసినప్పుడు దారుణంగా ఉంటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్పందించిన మల్లారెడ్డి సమస్యలను కార్పొరేషన్ కమీషనర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరింపజేస్తానని హామీనిచ్చారు. అదే విధంగా ఎస్ఎన్డిపి నాలాల ఏర్పాటు కోసం తవ్విన రోడ్లకు కూడా మరమ్మతులు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వర్షాలు ఇంకా కురుస్తున్న నేపథ్యంలో కార్పొరేషన్, ఎస్ఎన్డిపి అధికారులు సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అల్మాస్గూడకు సంబంధించిన 3, 4 డివిజన్లలో వరద నీటి సమస్యల నివారణ కోసం నిర్మించిన నాలాల్లో పేరుకుపోయిన ఇసుక, మట్టి, బురదను యుద్ధ ప్రాతిపదికను తీయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం విషయంలో అధికారులు కో ఆర్డినేషన్ చేసుకోకపోతే సమస్యలు తీవ్రతరం అవుతాయనీ ఈ నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### వినాయకహిల్స్లో డ్రైనేజీ సమస్యలు పరిష్కారం



వినాయక హిల్స్లో గల్ఫర్ సిబ్బందిచే డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్న బోయపల్లి రాఘవేందర్రెడ్డి

సరూర్నగర్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త: బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లోని 5వ డివిజన్ వినాయకహిల్స్ కాలనీలో గత కొన్ని రోజులుగా స్థానిక ప్రజలకు ఇబ్బందికరంగా మారిన డ్రైనేజీ సమస్య అల్మాస్గూడకు చెందిన మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్రెడ్డి చొరవతో పరిష్కారం అయ్యింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలనీలో పరిష్కారం కాకుండా ఉన్న డ్రైనేజీ సమస్యతో అవస్థలు పడుతున్న కాలనీవాసులు రాఘవేందర్రెడ్డి దృష్టికి తెచ్చారు. ఈ మేరకు ఆయన కమీషనర్ సరస్వతికి ఇక్కడి పరిస్థితిని వివరించారు. అయితే రాఘవేందర్రెడ్డి అభ్యర్థన మేరకు కమీషనర్ శనివారం కాలనీకి గల్ఫర్ మిషన్ను పంపారు. ఈ నేపథ్యంలో ఆయన దగ్గరుండి మరీ గల్ఫర్ సిబ్బందితో డ్రైనేజీల్లో పూడిక తీయించి శుభ్రం చేయించడంతో మురుగు సమస్య పరిష్కారం అయ్యింది. ఈ నేపథ్యంలో కాలనీవాసులు రాఘవేందర్రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజవర్ధన్రెడ్డి, ప్రతాప్రెడ్డి, నవా రు యాదిరెడ్డి, అరవింద్రెడ్డి, సుదర్శన్రెడ్డి పాల్గొన్నారు.

### కేబుల్ ఆపరేటర్లు నిబంధనలను పాటించాలి : విద్యుత్ ఏఇ ప్రసాద్

మలక్ పేట ,సెప్టెంబర్ 13, ప్రభాతవార్త: కేబుల్ ఆపరేటర్లు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చాదర్ ఘాట్ విద్యుత్ శాఖ ఏఇ ప్రసాద్ పేర్కొన్నారు. చాదర్ ఘాట్ లోని ఏఇ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన కేబుల్ ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని చాదర్ ఘాట్ విద్యుత్ శాఖ పరిధిలోని కేబుల్ ఆపరేటర్లకు నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. 18 అడుగుల ఎత్తులో కేబుల్ వైర్లను ఏర్పాటు చేసుకోవాలని, కేబుల్ ఆపరేటర్లు ఏ ప్రాంతాలలో కేబుల్స్ వేస్తున్నారనే విషయం గురించి తమకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కేబుల్ ఆపరేటర్లు నియమ, నిబంధనలను పాటించకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



వనస్థలిపురం. సెప్టెంబర్.13.ప్రభాతవార్త.
వనస్థలిపురం సచివాలయ నగర్ కాలనీలోని శ్రీ శ్రీ శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల బ్రోచర్ను శనివారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఏసిపి పి.కాశిరెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపి మాట్లాడుతు వనస్థలిపురం ప్రాంతం ఆధ్యాత్మికతకు కేంద్రంగా నిలుస్తుందన్నారు. స్థానికంగా ఉన్న దేవాలయాలు నగరంలోనే ప్రసిద్ధి చెందినవని తెలిపారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాటుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుండి అక్టోబర్ మూడో తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా స్వామివారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహితున్నామని తెలిపారు.కార్యక్రమంలో సెక్టర్ ఎస్సై రవి, ఆలయ ప్రధాన కార్య దర్శి సత్యనారాయణ, సహాయ కోశాధికారి రామలక్ష్మీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు, సభ్యులు సునీల్ కుమార్ గౌడ్,పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై రాజీ లేదు
### -అధికారుల నిర్లక్ష్యాన్ని సహించం



నేరేడ్మెట్, సెప్టెంబర్ 13:ప్రభాతవార్త : ప్రజలకు ఇబ్బంది కలిగించే విషయాల్లో రాజీ ఉండదని, అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదు" అని బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు దాచబోయిన సాయినాథ్ స్పష్టం చేశారు.నేరేడ్మెట్ శిరిడి సాయి కాలనీలో కొత్తగా నిర్మించిన రహదారిపై కాంట్రాక్టరు వదిలేసిన మట్టి కుప్పలు, చెట్టు కొమ్మలు బేతేల్ మార్తోమా సిరియన్ చర్చ్ ఎదుట పేరుకుపోయి ఉండడంతో వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థామస్ హైట్స్ పాఠశాలకు వెళ్లే పిల్లలు రాకపోకలలో నరకయాతన అనుభవిస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయం ఫోన్ ద్వారా తెలియజేయడంతో ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి సూచనల మేరకు మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం మున్సిపల్ అధికారిణి మంజులను సంప్రదించి చెట్టు కొమ్ములు, మట్టి కుప్పలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. గత ఇరవై రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతుండగా అధికారులు స్పందించకపోవడంపై ఆయన మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నవీన్,శ్రీకాంత్, గంగపుత్ర రవి,సక్కుబాయి, చరణ్, అరవింద్,నిశాంత్ స్థానిక యువకులు పాల్గొన్నారు.

### నాచారం పోలీసులకు ఘనంగా సన్మానం



నాచారం పోలీస్ సిబ్బందిని సన్మానిస్తున్న జేఏసీ నాయకులు

నాచారం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : ప్రజలకు నిరంతరం సేవలందించడంలో నాచారం పోలీసులు ఆదర్శంగా నిలుస్తున్నారని జేఏసీ సంస్థల వ్యవస్థాపకులు నల్లా రాధాకృష్ణ పేర్కొన్నారు. శనివారం నాచారం పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్ రుద్వీర్ కుమార్, ఎస్సై ప్రభాకర్ రెడ్డి, ఏఎస్ఐ ఇద్దయ్యలను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నల్లరాధాకృష్ణ మాట్లాడుతూ వినాయ చవితి పండుగను పురస్కరించుకొని మండపాల నిర్వహణ, నిమజ్జన వంటి కార్యక్రమాలు శాంతియుతంగా ప్రజలు పండుగను జరుపుకునేలా చర్యలు తీసుకున్న పోలీసులకు అభినందనలు అన్నారు. అనంతరం ఇన్స్పెక్టర్ రుద్వీర్ కుమార్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కనుకుంట్ల విజయ్, ప్రేమ్కుమార్, సాయిబాబా, గద్ద యుగందర్, బాడిత గణేష్ గౌడ్, కొమ్మగల్ల వెంకటేశ్వర్లు, శేఖర్ రెడ్డి, మన్నె నర్సింహ్మా రెడ్డి, శ్రీనవాస్ రెడ్డి, మల్కరి అశోక్, వేణు, భైర పా సురేందర్, నరేంద్ర, మోహన్, బొల్లం చంద్రమౌళి, రాజుగౌడ్ పాల్గొన్నారు.

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన బండ కార్తిక రెడ్డి



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న బండ కార్తిక చంద్రారెడ్డి

తార్నాక, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త :
బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఇటీవల నిమమితులైన మాజీ మేయర్ బండ కార్తిక చంద్రారెడ్డిని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసిశారు. పార్టీలో తనకు సముచిత ప్రాధాన్యత కల్పించినందుకు కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపడం జరిగిందని ఆమె తెలిపారు. తాను పార్టీ కోసం అంకిత భావంతో అందించిన సేవలను గుర్తించినందుకు మంత్రికి కృతజ్ఞతలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, పోచయ్య యాదవ్, వీరన్న, కొన్నె సంపత్, రాజ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి
### :వైస్ ఛాన్సలర్ కిషన్కుమార్రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కిషన్కుమార్రెడ్డి, శ్రీనివాసరావు

ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:
పెరుగుతున్న పోటీ ప్రపంచాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ టి.కిషన్కుమార్రెడ్డి పేర్కొన్నారు. పట్ట భద్రుల స్నాతకోత్సవ సభనాగోల్ అవంతి డిగ్రీ, పిజి విద్యాసంస్థల స్నాతకోత్సవ సభ నాగోల్ డివిజన్ జైపురికాలనీలోని కళ్యాణలక్ష్మి గార్డెన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. పట్టభద్రుల స్నాతకోత్సవ సభకు కిషన్కుమార్రెడ్డి, శ్రీనివాసరావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఇష్టంగా కష్టపడి చదివితేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు నవీనీకరించుకుంటూ విద్యార్థులకు విద్యాబోధన చేస్తుండడం పట్ల అవంతి విద్యాసంస్థలను ఆయన అభినందించారు. విద్యాసంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంతో పాటు కళాశాలను యూనివర్సిటీ స్థాయికి తీసుకు వెళ్లడమే తమ లక్ష్యం అన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.లక్ష్మణ్కుమార్, టీజీసిహెచ్ఈ వైస్చైర్మన్ ప్రొఫెసర్ ఎస్కె.మహమూద్, ఓయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.శశికాంత్, దిహిందూ పత్రిక సీనియర్ ఉపసంపాదకులు రవికాంత్రెడ్డి, బాగ్అంబర్పేటలోని ఈశ్వరీయ బ్రహ్మకుమారిస్ శ్రీలత, అవంతి విద్యాసంస్థల జనరల్ సెక్రెటరీ ప్రియాంక, ప్రిన్సిపాల్ డాక్టర్ రాకేష్ మానుక, హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై. జయప్రద, వివిధ బ్రాంచిల ప్రిన్సిపాల్స్, పాల్గొన్నారు.

### సంపూర్ణ ఆరోగ్యం కోసం జిమ్: కార్పొరేటర్



జిమ్లో పాల్గొన్న పవన్కుమార్, లింగాల నాగేశ్వరరావు

ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:
సంపూర్ణ ఆరోగ్యం కోసం నిరంతరం వ్యాయామం చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని ప్రజయ్నివాస్ ఫేస్1లో శనివారం నూతన అదునాతన సౌకర్యాలతో కూడిన జిమ్ను ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్చైర్మన్ లింగాల నాగేశ్వరరావుతో కలిసి కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అన్ని వయసుల వారికి అనువైన వ్యాయామ పరికరాలు, శిక్షణ సౌకర్యాలు జిమ్ పరికరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రస్తుత వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యం, ఫిట్నెస్ అత్యంత ముఖ్యమైనవని, యువతతో పాటు ప్రతిఒక్కరూ వ్యాయామం, యోగా, క్రీడలతో మన శరీరాన్ని ఆరోగ్యవంతంగా తయారు చేసుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రామారావు, లింగేశ్వర్, శివ, సురేష్, రమణ, బిజెపి నాయకులు సుందర్ నారాయణ, గట్టు మహేష్కుమార్, సాయిపాటిల్, యువత, మహిళలు పాల్గొన్నారు.

### సింగరేణి కాలనీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలి



సుకన్యకు వినతిపత్రం అందజేస్తున్న షేక్ మహమూద్

సైదాబాద్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త: పేదలు నివసించే సింగరేణి కాలనీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సైదాబాద్ మండల ఉప విద్యాశాఖ అధికారి సుకన్యకు శనివారం బాలల హక్కుల పరిరక్షణ వేదిక సైదాబాద్ మండల కన్వీనర్ షేక్ మహమూద్ వినతి పత్రం అందజేశారు. శంకేశ్వర్ బజార్లోని ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కబ్జా నుండి కాపాడాలని, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి అలివేలు, గోపాల్, ఎం.వి.ఫౌండేషన్ సంతోషి పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి : బన్నాల గీత



చిలుకానగర్లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

ఉప్పల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త : చిలుకానగర్ డివిజన్ లోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం చైల్డ్ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్, స్టాండింగ్ కమిటి మాజీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్లో చైల్డ్ వికాస్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో ఉచితంగా రక్తదానం చేయడంతోపాటు, పలువురికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కేర్ హాస్పిటల్, స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ , క్లోవ్ డెంటల్ హాస్పిటల్,ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ హాస్పిటల్ సిబ్బంది ఉచిత పరీక్షలు నిర్వహించారని తెలిపారు. పేద ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన చైల్డ్ వికాస్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ విజయ రమేష్, ట్రస్టీ పుష్పారెడ్డి, మేనేజర్ రమేష్లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఉప్పల్ పాస్టర్ అసోసియేషన్ నేత గోనె ఫిలిప్స్, సీనియర్ నేతలు కొండల్ రెడ్డి,చేర్యాల శ్రీనివాస్, బలరాం, ఎం. శ్రీనివాస్ యాదవ్, శ్యామ్, చైల్డ్ వికాస్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.